

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

**ఆ తర్వాత రెండు మూడురోజుల్లోనే** హిందూ చదువుతూంటే ఓ న్యూస్ ఐటం వచ్చింది. దేశంలో అనేక మందులు డూప్లికేట్ చెయ్యబడుతున్నాయనీ, అందులో ప్రాణదానం చేసే బెట్‌నిసాల్ కూడా ఒకటనీ నివ్వెరపోయాడు. అప్పట్నుంచీ ఆ రకం మందులు వాడేటప్పుడు చాలా జాగ్రత్తలు పడేవాడు.

ఏ వృత్తిలో అయినా అవినీతి వుండడానికి అవకాశముంది. అలా ఉండకుండా ఉండటానికి ఎంత ప్రయత్నించినా, అతన్ని అవినీతిమయం చెయ్యటానికి ప్రయత్నిస్తారు ప్రజలు. ఈ దాడి ఎదుర్కోవాలంటే ఎంతో మనో నిబ్బరం ఉండాలి.

సర్టిఫికెట్లకోసం రకరకాలవాళ్ళు వచ్చేవాళ్ళు – అత్తారింటికొచ్చి బాగా పిండివంటలు అవీ తిని, ఆ మత్తులో ఆఫీసు విషయం మరిచిపోయి, ఎం.సి కోసం మామగార్ని వేధించడం – మా డాక్టరుగారున్నారుగా అని ఆ మామగారు వెళ్ళి డాక్టరుగారి మీద పడటం. లేకపోతే అలవాటుగా మానేసేవాళ్ళు. చిన్నదానికి గోరంతలు చేసుకుని రోజులకొద్దీ సెలవుపెట్టి ఆ తర్వాత ఎం.సి కోసం పీడించేవాళ్ళు – పెళ్ళానికి జబ్బు చేస్తే అమ్మో అనుకుని, లేకపోతే అబ్బాయికో, అమ్మాయికో సుస్తీ చేస్తే అబ్బో అనుకుని ఆఫీసు ఎగ్గొట్టేసి తర్వాత ఎం.సి కోసం ఎగబడేవాళ్ళు. ఒక ఊరినుంచి యింకో ఊరు ట్రాన్స్‌ఫరయితే ఆ బదిలీ ఆపించుకునే నిమిత్తం హైదరాబాద్ వెళ్ళి ప్రయత్నం చేసుకోటానికి, లేకపోతే కోర్టు వాయిదా ఎగవేద్దామనుకున్నప్పుడు, వాళ్ళు చేసిన తప్పులకు డాక్టర్లని పూచీ ఇవ్వమని ఒత్తిడి తీసుకురావటం, ఇవ్వనంటే రికమెండేషన్ తీసుకురావడం –

ఇవన్నీ అలా వుంచి స్కూల్ పిల్లల సర్టిఫికెట్లు.. టీచర్లుగాని, హెడ్ మేస్టర్లుగాని, హెడ్‌మిస్ట్రెస్‌లుగాని పిల్లలు బడి మానేసినప్పుడు మెదలకుండా వుండి పరీక్షలయిపోయాక రిజల్ట్స్ వచ్చే టైములో అటెండెన్స్ షార్ట్ అయిన వాళ్ళని విత్ హెల్డ్ లిస్ట్‌లో పెట్టటం, ఆ తర్వాత ఆ పిల్లల్నీ, వాళ్ళ తలిదండ్రులనీ రోజులకి రోజులు త్రిప్పించుకుని చివరకు ఏవేవో తారీఖులు వేసి, ఇంత పొడుగు లిస్ట్ తయారు చేసి ఆయా తేదీలకు డాక్టర్ సర్టిఫికెట్ తీసుకురమ్మనటం, పరపతిలేని తలిదండ్రులు ఏం చెయ్యాలో తెలీక డాక్టర్ల దగ్గరకెళ్ళి గంటలకు గంటలు నిరీక్షించి ప్రాధేయపడటం. నరేష్ అయితే తాను ట్రీట్‌మెంట్ చెయ్యని కేసులకు నిర్మొహమాటంగా నిరాకరించేవాడు. కాని పిల్లల విషయం వచ్చేసరికి అతని హృదయం ద్రవించేది. ఒక్క సంతకంతో ఏడాది చదువు వ్యర్ధం చెయ్యకుండా చెయ్యవచ్చు మెత్తపడాల్సి వచ్చేది.

ఒకసారి పదిహేను, పదహారేళ్ళున్న ఓ అమ్మాయి టెన్త్ క్లాస్ చదువుతోంది. ఆ అమ్మాయికి పెళ్ళయింది. ఆ పెళ్ళికి టీచర్లూ, హెడ్‌మిస్ట్రెస్ కూడా వచ్చారు. కాని తర్వాత ఎగ్జామ్స్ కి ఎపియరయే టైముకి పెళ్ళిరోజుల్లో అటెండెన్స్ షార్టవటం వల్ల ఒంట్లో బాగోలేదని ఎం.సి తీసుకొస్తేనేగాని పరీక్షకి పంపించమన్నారు. ఆ అమ్మాయి కంగారుపడి నా పెళ్ళని సెలవు పెట్టాను కదండీ, శుభలేఖ కూడా ఇచ్చాను కదా, నా పెళ్ళికి మీరంతా వచ్చారు కూడా కదండీ, భోజనాలు చేశారు కదండీ, హాయిగా పెళ్ళి చేసుకుని జబ్బని సర్టిఫికెట్ ఇమ్మంటే ఏ డాక్టరు ఇస్తాడండీ? అంటే "అవన్నీ మాకు అనవసరం నీకు పెళ్ళికాని, ఏమన్నా కానీ, ఆరోజుల్లో నీకు జబ్బు చేసింది మంచానపడి ఉన్నావు. అందుకని స్కూల్‌కు ఎటెండ్ కాలేకపోయావు. అలా అని సర్టిఫికెట్ తీసుకొస్తేనే ఎగ్జామ్స్ కి పంపించేది" అన్నారు. ఆ అమ్మాయి కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ నరేష్ దగ్గరకొచ్చింది.

ఆడపిల్ల పుష్పవతి అయితే ఆ విషయం రాస్తూ లవ్‌లెటర్ పెడితే ఒప్పుకోరు. ఆ టైముకి ఆ అమ్మాయికి డయేరియాఅనో, డిసెంట్రో అనో, లేక ఏ ఫీవర్ పేరో రాయాలి.

ఇహ కొన్ని కొన్ని కంపెనీలకి రియంబర్స్‌మెంట్లు ఉంటాయి. ఆయా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకుగాని, వాళ్ళ భార్యలకు గాని మెడికల్ బిల్లు ఏడాదికి కొన్ని వందలో, వేలో కంపెనీ నుండి రియంబర్స్‌మెంట్ పొందటానికి అర్హత వుంటుంది. డబ్బు వచ్చే అవకాశముంది కాబట్టి జబ్బు చేసినా చెయ్యకపోయినా బిల్స్ రాయించుకోవటం, అదొక పెద్ద పరీక్షలాగా రాసిన జబ్బు పేరు రాయకుండా పైసలతో సహా తేడా రాకుండా బిల్స్ రాయటం .. నిజంగా జబ్బులు చేస్తే ఉపయోగంచాల్సిన స్కీం – ఈ విధంగా దుర్వినియోగం చెయ్యబడటం అతనికెంతో మనఃక్లేశాన్ని కలిగించింది.

పేషెంట్లుని డాక్టరు తన దగ్గరకు ఆకట్టుకోవాలంటే తన ఇమేజ్ పెంచుకోవాలి. ఇమేజ్ అంటే మాటలు చెప్పినంత తేలిగ్గా రాదు. ముప్పయి, నలభయి ఏళ్ళ క్రితం అయితే డాక్టర్లింతమంది ఉండేవారు కాదు. ఫ్యామిలీ డాక్టర్ అనే పదానికి సరి అయిన నిర్వచనం వుండేది.కొన్ని కొన్ని కుటుంబాలు ఆ డాక్టరునే నమ్ముకుని, అతని సలహా సంప్రదింపుల మీదనే నడుచుకుంటూండేవారు.

ఇప్పుడు పరిస్థితులు మారాయి. డాక్టర్ల సంఖ్య పెరగటంతోబాటు, లేడీ డాక్టర్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు, స్పెషలిస్టులు కూడా ఎక్కువయిపోయారు. జనరల్ ప్రాక్టిషనర్ పరిస్థితి క్లిష్టంగా తయారయింది. కాస్త గుండెనొప్పి అయితే హార్ట్ స్పెషలిస్ట్ దగ్గరికే సరాసరి పరిగెడుతున్నాడు పేషెంటు. అందులో కరొనరీకేర్ యూనిట్స్ కూడా వచ్చేశాయి. ఇహ ఆడవాళ్ళు నెల తప్పటంతోనో, లేక ఇంకా ఏదన్నా గైనిక్ సంబంధమున్న ట్రబుల్ వున్నా ఎక్కువగా లేడీ డాక్టర్సుకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

కంటికి సంబంధించినవీ, గొంతు, చెవి, ముక్కులకూ సంబంధించినవీ సరేసరి. అలాగే పెడియాట్రిక్స్, సర్జరీ ప్రతి డిపార్ట్‌మెంటుకూ స్పెషలైజేషన్ ఉంది. జ్వరం కేసులూ, రొటీన్ కేసులూ ఎన్ని వచ్చినా ఇమేజ్ రాదు. అందులో థ్రిల్ ఏదీ

ఉండదు. డాక్టరు ప్రజల్లో తనకో స్థానాన్ని కలిగించుకోవాలంటే కొన్ని జటిలమైన కేసులు టేకప్ చేసి తీరాలి. వైద్య చికిత్సలో రిస్క్ తప్పదు.

తన దగ్గరకు వచ్చే పేషెంట్స్‌లో ఎక్కువమంది పిల్లలను తీసుకురావటాన్ని నరేష్ గ్రహించాడు. ఇలా ఎందుకు జరుగుతోంది? సహజంగా పెడియాట్రిక్స్‌లో కేసులు ఎక్కువగా ఉండటం వల్లనా? లేక తన దగ్గర పిల్లల వైద్యం బాగా జరుగుతుందన్న నమ్మకం ఏర్పడటం  వల్లనా?

ముస్లింలలో ఫ్యామిలీ ప్లానింగ్ ఎక్కడో తప్ప ఇంకా ఎవరూ అమలుపరచటంలేదు.ఒక్కొక్కరికీ ఏడెనిమిది మమి పిల్లలుంటారు. దగ్గర దగ్గర కాంపులవటం వల్ల ఆ పిల్లలకు ఏదో ఒక సుస్తీ చేయటం, సహజంగా వాళ్ళు డాక్టర్ల దగ్గరకు తీసుకురావటం జరుగుతూ ఉంటుంది.

పోలియో డ్రాప్స్ ఎంత ఎక్కువగా వేయించుకుంటున్నా ఇంకా చాలామందికి వస్తూనే వుంది. నెలలు నిండుతుండగానే త్వరపడి వేయించకపోవడం, అశ్రద్ధ, వేయించినప్పుడు కూడా డాక్టర్లు చెప్పిన టైముకి రాకుండా వీలు చూసుకుని  రావడం..

నరేష్ పేషెంట్లు అడిగినా అడక్కపోయినా యిమ్యూనిటీ గురించి వివరంగా చెప్పేవాడు. ఏ నెల్లో ఏ యింజక్షన్ చేయించాలో, బి.సి.జి ఎప్పుడు వెయ్యాలో, మళ్ళీ బూస్టర్ డోస్ ఎప్పుడు వెయ్యాలో వాళ్ళు చెబితే సరిగ్గా గుర్తుంచుకోవటం లేదని కార్డులు ప్రింట్ చేయించాడు.అందులో కేవలం యిమ్యూనిటీ గురించేకాకుండా నెలవారీ బరువు, ఆయా నెలల్లో యివ్వవలసిన ఆహారం అన్నీ విపులంగా ప్రింట్ చేశారు.

చాలామంది తల్లి దండ్రులొచ్చి మా పిల్లలు చిక్కిపోతున్నారు మొర్రో అని వాపోతూ ఉంటారు. జాగ్రత్తగా వాకబు చేస్తే గేదపాలయితే అరగవేమోనన్న భయంతో విపరీతంగా నీళ్ళు కలిపెయ్యటం, డబ్బా పాలయితే వెయ్యవలసిన దాంట్లో మూడోవంతో, నాలుగోవంతో పిండి కలపటం – పిల్లలు పాలకు బదులు నీళ్ళు త్రాగి చిక్కిపోతుంటే చిక్కిపోతున్నారని గోల పెట్టటం వాళ్ళకి పాలు ఎలా కలిపి పట్టాలో, ఎన్ని గంటలకొసారి పట్టాలో, రాత్రుళ్ళు ఎందుకు పట్టకూడదో అన్నీ ఓపిగ్గా చెప్పేవాడు.

అలా చెబుతుంటే అతనికి విసుగ్గా కాకుండా, ఉత్సాహంగా వుండేది. ఒక మంచి పని చేస్తున్నట్లు తృప్తిగా ఉండేది. చిన్న పిల్లలలో వచ్చే అనేక వ్యాధులకు కారణం న్యూట్రిషనల్ డిఫిషియన్సీనే అనే సత్యం తలిదండ్రులకి బోధపరచటానికి చాలా శ్రమ తీసుకునేవాడు

ఒకసారి మెడికల్ అసోసియేషన్ భారీ ఎత్తున బేబీ షోని నిర్వహించింది. నరేష్‌ని కూడా ఒక జడ్జిగా వేశారు. బేబీ షో చాలా వందల మంది తల్లులు పాపం వాళ్ళ వాళ్ళ పిల్లల్ని తీసుకొచ్చారు. డబ్బులున్న వారి పిల్లలలో చాలామంది ఆరోగ్యవంతులుగా కనబడ్డారు. పేదవారిలో కూడా సహజ ఆరోగ్యం వున్నవారు అక్కడక్కడా కనపడక పోలేదు.

ఒక కార్మికుని ఏడు నెలల పాప ఆ ఏజ్ గ్రూప్‌లో బలంగా, ఆరోగ్యంగా, ఎక్కువ బరువుతో కనిపించింది. నరేష్ అందరికన్నా ఎక్కువ మార్కులు ఆ పాపకు వేసేశాడు. అతనితోబాటూ వున్న ఇంకో లేడీ డాక్టర్ అభ్యంతరం తెలిపింది. ఎందుకంటే నిబంధనల ప్రకారం యిమ్యూనైజేషన్‌కు కొన్ని మార్కులు, ఫీడింగ్ అలవాట్లకు కొన్ని మార్కులు కేటాయించి వున్నాయి కాని ఆ రెండూ పరిగణనలోకి తీసుకుంటే ఆ పాపకి మార్కులు మైనస్ అవుతాయి. కాని అతను ఒప్పుకోలేదు. యిమ్యూనైజేషన్ గురించి ఎడ్యుకేట్ చెయ్యాలనీ, ఫీడింగు గురించి తెలియచెప్పాలిగాని ఆరోగ్యంగా, పుష్టిగా వున్న పాపకు అందుకోసం మైనస్ పాయింట్లు వెయ్యకూడదని వాదించాడు. చివరకు అతని వాదనే నెగ్గింది. ఆ పాపకు ఫస్ట ప్రయిజ్ వచ్చింది.

అతని దగ్గరకు ఎక్కువగా పేద ప్రజలే వస్తూండేవారు. పేదవారి డాక్టరుగా అతనికి అప్పుడప్పుడే కొంచెం పేరు పడుతోంది. కన్‌సల్టేషన్ ఫీజంటూ ప్రత్యేకంగా ఏమీ తీసుకునేవాడుకాదు. అనవసరమైన మందులు రాసేవాడు కాదు. చాలా చౌకగా ట్రీట్‌మెంట్ పూర్తయిపోయేది.

ఎక్కువమంది పిల్లల్నే తీసుకొస్తూండేవారు.

పెడియాట్రిక్ డోసులు, కేసులు డయాగ్నిజ్ చెయ్యటం చాలా కష్టంగా వుండేది నెల్సన్ లేటెస్ట్ ఎడిషన్ తెప్పించి రాత్రి పొద్దుపోయేవరకూ శ్రద్ధగా చదువుతూండేవాడు.

ఒకసారి కాలేజీ వదిలి బయటకు వచ్చాక నాలెడ్జి పెంపొందింపచేసుకోవాలంటే చాలా యిబ్బందులుంటాయి. నిత్యకృత్యాలలో, ప్రాక్టీస్‌లో, కుటుంబ పరిస్థితులనుకూలం ఆర్థిక పరిస్థితులకూ, రాబడి డబ్బు డబ్బు సంపాదనలో సాధన చెయ్యటానికి అంతగా అవకాశం వుండదు. కాన్ఫరెన్స్‌లలో ఎక్కువగా స్లైడ్లు అవీ వేసి చాలా లోతుగా డిటెయిల్డ్ స్టడీ చెబుతారుగానీ, ఎక్కువగా జనరల్ ప్రాక్టీషనర్ ఎదుర్కొనే యిబ్బందులు చర్చించరు. తోటి ప్రాక్టీషనర్స్‌తో చర్చించటానికి, అడిగి తెలుసుకోటానికి అనేక ప్రాక్టికల్ యిబ్బందులు వస్తూంటాయి. ఉదాహరణకి కేసు పంపించకుండా సందేహాలు అడిగితే కేసు పూర్తిగా చూస్తేనేగాని చెప్పలేనంటాడు. కేసు పంపించాలంటే ఆ డాక్టరుకు కన్‌సల్టేషన్ ఫీజు యిచ్చే స్తితిలో పేషెంటు వుండాలి. ఊరికినే పరీక్ష చేసి సలహా చెప్పమనటానికి మొహమాటం అడ్డువొస్తుంది. మళ్ళీ మళ్ళీ కేసులు రిఫర్ చెయ్యటానికి అవకాశం వుండదు.

అందుకని జర్నల్స్ చదువుతూ కేసుల్ని ఎక్కువగా నిశితంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు ఆత్మ విమర్శ చేసుకుంటూ, మెడికల్ కాన్ఫరెన్స్‌లలో ప్రశ్నల టైములో మొహమాట పడకుండా కేసులు ట్రీట్ చేస్తున్నప్పుడు తన కొచ్చిన సమస్యలను వివరించి సందేహాలు నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగాలి.

అతన్ని అనేక విషయాలు కలతపెట్టసాగాయి.

ఎలర్జీకి మందులేదు. కాస్త చలిగాలి తగిలినా, వాతావరణంలో మార్పు వచ్చినా, దుమ్మూ, ధూళీ పీల్చినా, వంటికి పడనిది తిన్నా ఎడతెగకుండా తుమ్ములు రావటం, వళ్ళంతా దురదలు, వాచిపోవటం, యాంటీ హింటమిన్స్ వేసుకుంటే విపరీతమైన మత్తు..

ఒకసారి వంకాయకూర తిని కేవలం ఎలర్జీయే గాక, షాక్ వచ్చి, అపస్మారక స్థితిలో చావు బ్రతుకుల మధ్యవున్న స్త్రీని తీసుకొచ్చారు. అప్పుడతను మధ్యాహ్నం రెండు గంటలవేళ భోజనం చేస్తున్నాడు. వాళ్ళ ఆదుర్దా చూసి మధ్యలో లేచి చెయ్యి కడుక్కుని వచ్చాడు. పరిస్థితి చాలా సీరియస్‌గా వుంది. పల్స్ అందటంలేదు. నాలుగు డెక్‌డ్రాన్‌లూ, రెండు గ్లూకోజు బాటిల్సూ ఎక్కితేకాని మనిషి వొడ్డున పడలేదు.

ఎలర్జీకి సంబంధించిందే ఆస్థమా. మనిషిని ప్రాణాలు తోడేస్తూ వుంటుంది – చావనివ్వదు, బ్రతకనివ్వదు, ఊపిరాడనివ్వదు. ఎప్పుడొస్తుందో తెలీదు.

డయాబిటిస్ పెషెంట్లని చూస్తే చాలా బాధగా వుండేది. ఏమీ తినటానికి లేదు. డాక్టర్ల సలహా ప్రకారమైతే తూచుకుని, కొలుచుకుని తినాలి. రోజూ టాబ్లెట్స్ మింగాలి లేకపోతే యిన్సులిన్ యింజక్షను చేయించుకుంటూ వుండాలి. ఈ డయాబిటిస్ పేషెంట్లు జబ్బు తగ్గుతుందన్న ఆశతో ఎవరేది చెబితే అది చేస్తుంటారు. పేపర్సులో ఎడ్వటైజ్‌మెంట్స్ చూసి పరిగెడుతూ వుంటారు. ఒకరు హోస్పేట అనీ, ఒకరు బెంగుళూరు అనీ.. మొదట తగ్గింది తగ్గింది అని పొంగిపోయి మిగతావాళ్ళకి కూడా ఇన్సిపిరేషన్ ఇస్తూ వుంటారు .హోమియో అనీ, ఆయుర్వేదమనీ, నాటుమందులనీ రకరకాల ప్రయోగాలు చేస్తూంటారు. మళ్ళీ అయిదారు నెలలయేసరికి పరిస్థితి మమూలే.

అలాగే బ్లడ్ ప్రెషర్ –

కేన్సర్ –

పిల్లలకు చాలా ఎక్కువగా వచ్చే వ్యాధి డయేరియా. వాటికి వాంతులు కూడా జోడయితే గ్యాస్ట్రో ఎటంర్‌రైటిస్.

వేసవి ఎండల్లో వడగాడ్పులకు సమ్మర్ డయేరియా.

వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలటం వల్ల ఇన్‌ఫెక్టివ్ డయేరియా.

చిన్న పిల్లల్లో డయేరియాలో చూస్తూండగానే డీ హైడ్రేషన్ వచ్చేస్తూ వుంటుంది.

డీహైడ్రేషన్ వచ్చిందా? డాక్టర్‌కు టెన్షన్ ప్రారంభమయిందన్న మాటే. ఒక హార్ట్ కేసు ట్రీట్ చేస్తున్నప్పుడు ఎంత టెనషన్ వుంటుందో, ఎంత నెర్వస్‌గా వుంటుందో డీ హైడ్రేషన్ కేసు ట్రీట్ చేస్తున్నప్పుడు కూడా అలాగే వుంటుంది. మొదట కళ్ళు లోపలకు పోతాయి. కడుపు మీది చర్మంలో బలం లోపించి ముడతలు పడుతుంది. ముఖం, బుగ్గలు పీక్కుపోతాయి. క్రమక్రమంగా కళ్ళలో జీవకళ తగ్గి, మృత్యువుకు క్షణం క్షణం దగ్గరవుతూ వుంటారు.

డీ హైడ్రేషన్ తగ్గించటానికి ఓరల్ థిరపే అంటూ మార్కెట్‌లో ఎలక్ట్రోలైట్ పౌడర్లు రకరకాల పేర్లతో వస్తున్నాయి. కాని నరేష్ అనుభవంలో యీ ఓరల్ ఫ్లూయిడ్స్ ఏమీ పనిచెయ్యవు. కనీసం ఫస్ట్ డిగ్రీ డీ హైడ్రేషన్‌లో కూడా వాటి ఉపయోగం ఏమీలేవు. పేషెంటులో కోలుకునే శక్తి పోకుండా వుంటే యీ ఓరల్ థిరప్ పనిచేశాననిపించుకుంటుంది. కేసు సీరియస్‌గా ఉన్నప్పుడు ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్ ఇచ్చి తీరాలి. చిన్న పిల్లలకు వెయిన్ దొరకటం కష్టం సబ్‌క్యుటేనియస్‌గా ఇస్తే పని చెయ్యదు. కొంతమంది హైలురానిడేషన్‌లనీ పొట్టలోనో, తొడలోనో సబ్‌క్యుటేనియస్‌గా ఇచ్చేస్తూ వుంటారు. అది పేషెంటు సంతృప్తికోసం ట్రీట్‌మెంట్ ఏదో చేశారు అనిపించుకోవటం ఉపయోగిస్తుందిగాని ప్రయోజనమేమీ వుండదు.

ఓ రాత్రివేళ...

అది చాలా మధురమైన రాత్రి. ఆ రోజు మేరేజ్‌డే. ఇంచుమించు ప్రాక్టిస్ పెట్టికూడా ఏడాదయింది. ఆ సాయంత్రం హాస్పటల్ పని తొందరగా ముగిస్తే నరేష్, సహజ సినిమాకి వెడదామనుకున్నారు. కాని కుదరలేదు. పని అంత ఎక్కువగా లేకపోయినా పేషెంట్లు తాపీగా, తీరిగ్గా, తమ సొంత పనులు చూసుకుని వస్తూండటం వల్ల మామూలు టైమే అయి చివరకు కుదరలేదు.

ఆమె బాధపడుతుందేమో అనుకున్నాడు. కానీ తేలిగ్గా తీసుకుని నవ్వేసింది.

ఇటువంటి పరిస్థితుల్లో ఏనాడూ ఆమె ముఖంలో బాధ చూసి ఎరుగడు. ఆమె ముఖంలో చిరునవ్వు చెరగటం ఎప్పుడూ కనబడలేదు. తను ఎంత ఆలశ్యంగా లోపలికి వెళ్ళినా పడుకుని నిద్రపోతూ వుండటంగానీ, విసుక్కోవటం కాని చూడలేదు. ఆమె ఏనాడూ అవి కావలనీ, ఇవి కావాలనీ, అక్కడకూ ఇక్కడకూ తీసుకెళ్ళమని అడగటం ఎరగడు. ఎంత రాత్రివేళ భోజనం ముందు కూర్చున్నా వేడి వేడిఅన్నమే వడ్డించేది. అతనికి ఏ కూర ఇష్టమో, ఏ పచ్చడి ఇష్టమో మొదటి వారం రోజుల్లోనే గ్రహించేసింది.

తర్వాతెప్పుడూ వంటలోకి ఏం చెయ్యమంటారు అని అడగటం ఎరగడు. కాని ఎప్పుడు చూసినా అన్నంలోకి తనకెంతో ఇష్టమైన ఆధరువులే కనిపించేవి.

సహజ తలంటు పోసుకుని ఉండటం వల్ల జుట్టంతా విరబోసి వుంది. కాటుక పెట్టుకోకపోయినా కళ్ళెప్పుడూ సహజమైన నలుపుతో మిలమిలలాడుతూ వుంటాయి. మనిషి కొంచెం పొడవే, కాని ఆ పొడవుకు తగ్గపొందిక.

ఇద్దరూ ప్రక్కప్రక్కన కూర్చుని అన్నం తిన్నారు.

"మనకో డైనింగ్ టేబులయినా లేదు" అన్నాడు నరేష్ విచారంగా.

"లేకపోతే ఏం? మనకేం తక్కువ – ఇది మాత్రం హాయిగా లేదూ? అయినా హాస్పటల్‌లో ఇంకా కొనుక్కోవలసినవి చాలా వున్నాయి. ఎక్సరే లాబ్, మైక్రోస్కోప్."

నిజానికి ప్రతి డాక్టరుకూ టేబుల్ మీద నిరంతరం ఓ మైక్రొస్కోప్ వుండటం ఎంతో అవసరం. పెద్ద పెద్ద బయో కెమికల్, కల్చర్, ఫావలాజికల్, మైక్రోబయాలజ్ టెస్టులకు బయట లేబరేటరీలకు పంపించినా, కేసుని త్వరత్వరగా

డయాగ్నైజ్ చెయ్యటం కోసం. 3నిమిషాల మీద చేసే క్లినిక్‌లో టెస్టులు, డాక్టరు స్వయంగా చేసుకోవటం కోసం మైక్రోస్కోప్ విధిగా వుండాలి. దీనివల్ల టైమూ కలిసి వొస్తుంది. స్వయంగా చూశానన్న తృప్తి వుంటుంది. బయటకు వెళ్ళి డబ్బు యిచ్చుకోలేని పేషెంటుకు సౌకర్యంగా ఉంటుంది.

భోజనాలు ముగిశాయి.

ఆ మంచం మీద తెల్లటి దుప్పటి కవ్విస్తూ ఆహ్వానిస్తోంది.

తాను పడుకుని ఆమెను చేతులు పట్టుకుని గుండెలమీదకు లాక్కున్నాడు.

బెడ్‌లైట్ వెల్తుర్లో నల్లగా మిలమిలలాడుతున్న ఆమె కళ్ళలోకి చూస్తూ "సహజా!" అన్నాడు.

"ఊ"

"ఎందుకంత అందంగా వున్నావు?"

"మీకోసం."

చాలామంది ఆడవాళ్ళని చూస్తుంటే మొత్తం మీద అందమున్నా – కళ్ళలోనో, ముక్కో, మెడో, వక్షస్థలమో, నడుమో, లేక ప్రక్కనుంచి చూస్తేనో, నూటికి నూరుపాళ్ళు సరిగ్గా యిమడక ఎక్కడో ఏదో లోపం కనిపిస్తూ వుంటుంది. కాని సహజలో మాత్రం ఎంతో సహజంగా అమరినట్టు అతని కంటికి కనిపిస్తూ వుంటుంది.

"ఈ ఏడాదిలో నీకోసం మీ వాళ్ళెవరూ రాలేదుకదూ?"

"వస్తారని కూడా నేననుకోలేదు."

"నీకు బాధగా లేదూ?"

"నేను కోరుకున్న, ఊహించుకున్న మీరుండగా నాకే ఇతర బాధా వుండదు."

"సహజా! నేను పెద్ద డాక్టరునవుతానంటావా?"

"అవుతున్నారు. ఇంకో ఏడాదిలో అయిపోతారు."

"ఇంకో ఏడాదిలోనే?"

"అవును. ఏ డాక్టరయినా మొదటి రెండు మూడేళ్ళు లోపుగానే తన యిమేజ్ సృష్టించుకోగలగాలి. మొదటి రెండు మూడేళ్ళలో యావరేజి డాక్టరుగా పేరు పడితే యిహ ఎన్నాళ్ళయినా ఆ పేరు పోదు. ముందే డాషింగ్‌గా వుండి మంచి పేరు తెచ్చుకుంటే యిహ తిరుగుండదు. ఎన్ని తప్పులు చేసినా జనం క్షమిస్తూ వుంటారు" అంటూ సహజ నవ్వింది.

"మొదటి సంవత్సరం నేను నెగ్గినట్లేనా?"

"వచ్చే జనాన్ని బట్టి తెలీటంలేదూ?"

గుండెలమీద నుంచి ఆమె ముఖాన్ని తన ముఖం మీదకు లాక్కున్నాడు.

ముఖానికి ముఖం, హృదయానికి హృదయం, చేతులు ఇంకా దగ్గరకు హత్తుకుంటూ – అలసిపోతూ ఒకరితో ఒకరు...

బయట కాలింగ్ బెల్ టంగ్‌మని గుండెలమీద మ్రోగినట్లు.

"చచ్చాం"

"లేవండి."

"ఉహూ."

బయట కాలింగ్ బెల్.

"ప్లీజ్ లేవండి"

"ఎలా చెప్పు ఈ స్థితిలో"

"మీరు డాక్టరు."

"ఇప్పుడు కూడానా?"

"డాక్టరనేవాడు ఎప్పుడూ డాక్టరే."

మళ్ళీ కాలింగ్‌బెల్ – దాంతోబాటు "డాక్టరుగారూ" అన్న పిలుపులు.

"పాపం చాలా అర్జంటయి వుంటుంది."

"ఇది అంతకన్న యమర్జన్సీ"

"ఛీ!" అంటూ అతన్ని మృదువుగా తోసింది. అతను కూడా అప్పటికి విడివడటానికి మానసికంగా సిద్ధపడ్డాడు. లేచి ఒక్క నిమిషంలో బట్టలు వేసుకుని బయట తలుపు దగ్గరకి వచ్చాడు. బహుశా ప్రపంచంలో ఆ స్థితిలో లేవగలిగి యివతలకు వచ్చేసి ఒక్క డాక్టరు వృత్తికి చెందినవాడే.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS